సాక్షి ఖమ్మం

బుధవారం। 19। ఏప్రిల్। 2023



రైతుల 'పంట' పండింది!

నేలకొండపల్లి, కూసుమంచి మండలాల్లో కొత్త రకం వరి వంగడాలు సాగు చేసిన రైతులు అధిక దిగుబడి సాధించారు. 8లో



దివ్యాంగుల అవస్థలు

సత్తుపల్లిలో ఏర్పాటుచేసిన సదరం శిబిరానికి వైద్యులు ఆలస్యంగా రావడంతో దివ్యాంగులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. 10లో



వాతావరణం

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రత గరిష్ట స్థాయిలో నమోదవుతుంది. ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలవుతుంది.



న్యూస్‌రీల్

మెడికల్ కళాశాలలో సీట్ల భర్తీకి గ్రీన్‌సిగ్నల్

- 100 సీట్లతో తరగతులు ప్రారంభం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు ఇప్పటికే అనుమతి మంజూరు చేసిన ఎన్‌ఎంసీ (నేషనల్ మెడికల్ కమిషన్) తాజాగా 2023–24 విద్యాసంవత్సరంలో వంద సీట్ల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం ఎన్‌ఎంసీ అధికారులు లేఖ విడుదల చేశారు. కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి బ్యాచ్ విద్యార్థులను చేర్చుకునే సమయంలో ఐఎంసీ యాక్ట్ సెక్షన్ 35(2) ప్రకారం వారి విద్యార్హతలను పరిశీలించాలని అందులో సూచించారు. అలాగే ఎన్‌ఎంసీ నిబంధనలను తప్పక పాటించాలని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని, టీచింగ్ ఫ్యాకల్టీ, క్లినికల్ మెటీరియల్‌ను విద్యాసంవత్సరానికి సరిపడా సమకూర్చుకోవాలని సూచించడమే కాక ఏదైనా తప్పుడు సమాచారం ఇచ్చి ఉంటే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎన్‌ఎంసీ హెచ్చరించింది.

పీహెచ్‌సీలో అదనపు కలెక్టర్ తనిఖీ



వైద్యసేవలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

బోనకల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని అదనపు కలెక్టర్ స్నేహలత, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మహిళా క్లినిక్‌లో భాగంగా చేస్తున్న పరీక్షలపై ఆరా తీశారు. పీహెచ్‌సీకి వచ్చిన మహిళలతో మాట్లాడి చికిత్స వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించడమే కాక అవసరమైతే ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి పంపించాలని వైద్యులకు సూచించారు. ఎంపీడీఓ వేణుమాధవ్, ఏసీడీపీఓ కమలప్రియ, ఏపీఎం పద్మలత, వైద్యాధికారి స్రవంతి పాల్గొన్నారు.

వృత్తినైపుణ్యం పెంచుకోవాలి

ఖమ్మంలీగల్: ఉద్యోగులు వృత్తి నైపుణ్యం పెంచుకోవడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా న్యాయ సేవా సదన్‌లో న్యాయశాఖ ఉద్యోగులకు మంగళవారం ఏర్పాటుచేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. ప్రతీ వ్యక్తిలో ఉండే నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకునేలా నిరంతర పఠనం, శిక్షణ అవసరమని తెలిపారు. ఓర్పు, పట్టుదలతో పనిచేస్తే విజయం సాధించొచ్చని చెప్పారు. న్యాయవాదులు ఇమ్మడి లక్ష్మీనారాయణ, కొండపల్లి శ్రీనివాస్, కోర్టు ఏఓ సూర్యనారాయణ, ఉద్యోగులు రాధేశ్యాం, ఓంకార్ పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

తల్లాడ/కల్లూరురూరల్: తల్లాడ మండలం నూతనకల్‌లో ఉపాధి హామీ పథకం పనులను డీఆర్‌డీఓ విద్యాచందన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పంట కాల్వ పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఏపీఓ కోటయ్య, గ్రామ కార్యదర్శి ఎస్.కే.ఎజాజ్ పాల్గొన్నారు. అలాగే, కల్లూరు మండలం చెన్నూరు పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని డీఆర్డీఓ విద్యాచందన తనిఖీ చేశారు. డాక్టర్ ఇస్రత్ తబస్సుం, ఎంపీడీఓ రవికుమార్, ఏపీఎం వెంకటరామారావుతో పాటు కృష్ణకుమారి, వరలక్ష్మి, స్టాలిన్, నాగేశ్వరెడ్డి పాల్గొన్నారు.

అండర్ పాస్‌ల నిర్మాణానికి కసరత్తు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం రామన్నపేట సమీపంతో పాటు రఘునాథపాలెం మండలం కామంచికల్ – దారేడు మధ్య రైల్వే గేట్లను మూసివేయాలని రైల్వే శాఖ నిర్ణయించిన నేపథ్యాన అండర్ పాస్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మంగళవారం రైల్వే, ఆర్‌అండ్‌బీ, పీఆర్, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆర్డీఓ రవీంద్రనాథ్, ఈఈలు శ్యాంప్రసాద్, శ్రీనివాస్, తహసీల్దార్లు శైలజ, నర్సింహారావు పాల్గొన్నారు.



హాట్ సీట్.. పాలేరు!



- సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు ఇస్తానని సీఎం కేసీఆర్ చెప్పినందున నా సీటుకు ఢోకా లేదు
  – పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి
- పాలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దిన నాకు అవినాభావ సంబంధం ఉంది
  – మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- వచ్చే ఎన్నికల్లో పాలేరు నుంచి నేను పోటీ చేస్తా
  – వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిల
- బీఆర్‌ఎస్‌తో పొత్తు కుదిరితే మేం అడిగే మొదటి సీటు పాలేరే..
  – సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- కాంగ్రెస్ నుంచి పోటీ చేసేది నేనే..
  – పీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు

ఈ నియోజకవర్గంపైనే అన్ని పార్టీల అగ్రనేతల చూపు

- వచ్చే ఎన్నికల్లో పోటీ యోచనలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని
- వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల కూడా రంగంలోకి...
- బరిలో ఉంటామంటున్న కందాళ, తుమ్మల
- కాంగ్రెస్‌లో భట్టి, రేణుక వర్గాల పోటాపోటీ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాజకీయ పార్టీల్లోని రాష్ట్ర స్థాయి నేతల గురి పాలేరు నియోజకవర్గంపైనే ఉంది. మిగిలిన నియోజకవర్గాల్లో పరిస్థితి ఎలా ఉన్నా.. పాలేరు నియోజకవర్గం నుంచే వివిధ పార్టీల అగ్రనేతలు పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ప్రధాన పార్టీల్లో ఇద్దరు నుంచి ముగ్గురు వరకు టికెట్ కోసం పోటీ పడుతుండడం విశేషం. బీఆర్‌ఎస్‌లో టికెట్ కోసం సిట్టింగ్ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పోటీ పడుతుండగా.. పొత్తు కుదిరితే తమ పరిస్థితి ఏమిటని కమ్యూనిస్టులు అంటున్నారు. సీపీఎం నుంచి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సైతం పోటీ చేయాలనే ఆలోచనతో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక వైఎస్సార్‌టీపీ నుంచి తాను బరిలో ఉంటున్నట్లు ఆపార్టీ అధినేత్రి వైఎస్.షర్మిల ఇప్పటికే ప్రకటించారు. మరోపక్క కాంగ్రెస్‌లో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి వర్గాల నుంచి నేతలు పోటీకి సిద్ధమవుతుండడంతో పాలేరు నియోజకవర్గంలో ఇప్పటికే ఎన్నికల వేడి రగులుకుంది.

కాంగ్రెస్‌లోనూ అదే తీరు

కాంగ్రెస్‌లో సహజంగా ఉండే వర్గపోరు పాలేరు నియోజకవర్గంలో తలనొప్పిగా మారింది. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క వర్గానికి చెందిన రాయల నాగేశ్వరరావు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ కేడర్‌తో కలిసిపోతున్నారు. మరోవైపు కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి వర్గానికి చెందిన రామసహాయం మాధవీరెడ్డి, మద్ది శ్రీనివాస్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నాలు తీవ్రం చేశారు. ఈ ముగ్గురిలోనే ఒకరికి టికెట్ దక్కుతుందా, లేదంటే ఎన్నికల సమయాన పార్టీలో చేరే ప్రముఖ నేతకు ఎవరికైనా టికెట్ ఇస్తారా అన్నది తేలాల్సి ఉంది.

బరిలో షర్మిల

వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్.షర్మిల పాలేరు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నట్లు గతంలోనే ప్రకటించారు. ఇప్పటికే ఆమె పాదయాత్ర నిర్వహించడమే కాక కరుణగిరి వద్ద క్యాంప్ కార్యాలయ నిర్మాణం చేపట్టారు. పాలేరు బరిలో నిలిచి గెలిచేందుకు షర్మిల ఇప్పటి నుంచే వ్యూహాలకు పదును పెడుతున్నారు.

తమ్మినేని ప్రత్యేక దృష్టి

సొంత నియోజకవర్గం కావడంతో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాలేరుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మధ్యకాలంలో పలుమార్లు పాలేరు నియోజకవర్గంలో పర్యటించిన ఆయన బీఆర్‌ఎస్‌తో పొత్తు అంటూ ఉంటే తాము అడిగే మొదటి సీటు పాలేరు అని వ్యాఖ్యానించడం గమనార్హం. ఇటీవల సీపీఎం నిర్వహించిన జన చైతన్య యాత్రలకు బీఆర్‌ఎస్ మద్దతు ప్రకటించగా, ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. కానీ ఆతర్వాత ఆయన పాలేరు నుంచి తానే పోటీ చేస్తానని, కమ్యూనిస్టులను చూసి ఓట్లు వేసే రోజులు పోయాయని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై కమ్యూనిస్టులు దీటుగానే స్పందించారు. ఈ నేపథ్యాన పొత్తులు ఉంటాయా, ఉంటే ఏ పార్టీకి సీటు దక్కుతుంది, ఎవరు పోటీ చేస్తారనేది అటు కమ్యూనిస్టులతో పాటు ఇటు బీఆర్‌ఎస్‌లో ఆసక్తి కలిగిస్తోంది.

బీఆర్‌ఎస్‌లో పోటాపోటీ

పాలేరులో బీఆర్‌ఎస్ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ఎట్టి పరిస్థితుల్లో తానే పోటీలో ఉంటానని చెబుతున్నారు. అలాగే మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో ఇరువర్గాల మధ్య సయోధ్య లేకపోగా, ఎవరికి వారే కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇంతలోనే బీఆర్‌ఎస్‌తో కమ్యూనిస్టుల పొత్తు అంశం తెరపైకి వచ్చింది. దీంతో పొత్తు కుదురుతుందా, కుదిరితే ఎవరికి సీటు దక్కుతుందన్నది చర్చనీయాంశంగా మారింది.

రెండో విడత గొర్రెలు రెడీ..



గొర్రెల మందతో పెంపకందారులు

- విధివిధానాలను ఖరారు చేసిన ప్రభుత్వం
- జిల్లాలో 16,844 మంది లబ్ధిదారులు
- ఇప్పటికే రవాణా టెండర్లు పూర్తి

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో గొల్ల, కుర్మలకు రెండో విడత గొర్రెల పంపిణీకి కసరత్తు జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా విడుదల చేసిన నిబంధనల ఆధారంగా పథకం అమలుకు అధికారులు సిద్ధమవుతున్నారు. గొల్ల, కుర్మల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం 2017వ సంవత్సరంలో గొర్రెల పంపిణీ పథకాన్ని చేపట్టింది. అప్పట్లో ఒక్కో లబ్ధిదారుడికి రూ.1.25 లక్షల విలువైన 21జీవాలు అందించాలని నిర్ణయించి అమలు చేశారు. అయితే జీవాల ధరలు పెరగడంతో రూ.1.25 లక్షలుగా ఉన్న యూనిట్ ధరను రూ.1.75 లక్షలకు పెంచి ఇందులో లబ్ధిదారుల వాటా 25 శాతంగా నిర్ణయించారు. జిల్లాలో మొత్తం 33,688 మంది అర్హులుగా గుర్తించగా, తొలి విడతలో 16,844 మందికి గొర్రెలు పంపిణీ చేశారు.

వాటా ధనం సేకరణ

జిల్లాలో రెండో విడత(తుది విడత)గా 16,844 మందికి జీవాలు పంపిణీ చేయాల్సి ఉంది. ఇందులో 8,908 మంది ఇప్పటికే వాటా ధనంగా రూ.43,750 చెల్లించారు. మిగతా 7,936 మంది కూడా వాటా ధనం చెల్లించేలా అధికారులు అవగాహన కల్పించడంలో నిమగ్నమయ్యారు.

రవాణా టెండర్ల ప్రక్రియ పూర్తి

గొర్రెల కొనుగోళ్లలో రవాణాకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను జిల్లా పశు సంవర్ధక, పశువైద్య శాఖ పూర్తి చేసింది. వివిధ ప్రాంతాల్లో కొనుగోలు చేసిన గొర్రెలను లబ్ధిదారుల గ్రామాలకు చేర్చేందుకు టెండర్లు నిర్వహించారు. ఇక జీవాల కొనుగోళ్ల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులను నియమించాలని ప్రభుత్వం ఆదేశించారు. దీంతో కలెక్టర్ గౌతమ్ పర్యవేక్షణలో త్వరలోనే అధికారులను నియమించే అవకాశం ఉంది. ఆయా అధికారులు గొర్రెలు లభించే ప్రాంతాలకు వెళ్లి ఇక్కడి వాతావరణాన్ని తట్టుకుంటాయా, లేదా అని పరిశీలించాక కొనుగోళ్ల ప్రక్రియ మొదలుపెడతారు.

గొర్రెల పంపిణీకి చర్యలు



జిల్లాలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో గొర్రెల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 8,908 మంది లబ్ధిదారులు తమ వాటా ధనాన్ని చెల్లించారు. మిగతా వారు కూడా వాటాధనం చెల్లించి వివరాలు సమర్పించేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ప్రత్యేకాధికారుల నియామకం పూర్తికాగానే గొర్రెల పరిశీలన, కొనుగోళ్లు, పంపిణీ చేపడుతాం.

– బి.వేణుమనోహర్, జిల్లా పశుసంవర్ధక, పశువైద్యాధికారి

నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్లు

అదనపు కలెక్టర్ మధుసూదన్



సమావేశంలో మాట్లాడుతున్న డీసీఓ విజయకుమారి

ఖమ్మంవ్యవసాయం: యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసిన వరి ధాన్యాన్ని నిబంధనల మేరకు కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ ఎన్ మధుసూదన్ సూచించారు. కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లపై జిల్లా సహకార అధికారి(డీసీఓ) ఎ.విజయకుమారి అధ్యక్షతన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల అధ్యక్ష, కార్యదర్శులతో మంగళవారం సమావేశం ఏర్పాటుచేశారు. తొలుత డీసీఓ విజయకుమారి మాట్లాడుతూ జిల్లాలోని 70 పీఏసీఎస్‌ల ద్వారా 150 ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. ఆయా కేంద్రాల్లో 'ఏ' గ్రేడ్ ధాన్యానికి రూ.2,060, కామన్ గ్రేడ్‌కు రూ.2,040 ధర చెల్లిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా పీఏసీఎస్‌ల బాధ్యులు గోనె సంచులు, లారీలు, మిల్లర్లతో ఎదురయ్యే సమస్యలను ఏకరువు పెట్టగా, అధికారిక పనులతో సమావేశానికి హాజరుకాని అదనపు కలెక్టర్‌కు డీసీఓ ఫోన్‌లో తెలిపారు. దీంతో ఆయన స్పందించి ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈమేరకు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేందర్, మేనేజర్ జి.సోములు తదితరులు పాల్గొన్నారు.

ఎండ ప్రచండం



- కూసుమంచిలో అత్యధికంగా 44.2 డిగ్రీలు
- పెరిగిన గృహ విద్యుత్ వినియోగం

ఖమ్మంవ్యవసాయం: ఎండ తీవ్రరూపం దాలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా మంగళవారం దాదాపు అప్రమత్తత(ఆరెంజ్) స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కూసుమంచి మండల కేంద్రంలో అత్యధికంగా 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రజలు ఉక్కపోతతో బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం 9గంటల నుంచే ఎండ ప్రభావం మొదలై మధ్యాహ్నం తారాస్థాయికి చేరుతుండడంతో ప్రజలు ఇళ్లు దాటి రావడం లేదు. దీంతో మధ్యాహ్నం ఏ రహదారి చూసినా నిర్మానుష్యంగా కనిపిస్తోంది. ప్రస్తుతం సాగుతున్న యాసంగి వ్యవసాయ పనులకు కూడా ఎండతో ఆటంకం ఏర్పడుతోంది.

విద్యుత్ వినియోగం పైపైకి..

అధిక ఉష్ణోగ్రతల కారణంగా కూలర్లు, ఏసీల వాడకంతో గృహ విద్యుత్ వినియోగం పెరుగుతోంది. జిల్లాలో మంగళవారం 5.79 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరగగా. ఇందులో 80 శాతం గృహాల్లో ఉపయోగించిందేనని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 40డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాల వివరాలిలా ఉన్నాయి. కూసుమంచిలో జిల్లాలోనే అత్యధికంగా 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, తిరుమలాయపాలెంలో 43.9, సత్తుపల్లిలో 43.7, మధిరలో 42.7, వేంసూరు, ఎర్రుపాలెంలో 42.4, నేలకొండపల్లిలో 42.3, బచ్చోడు, ఖమ్మం ఎన్నెస్పీ గెస్ట్ హౌస్ వద్ద 41.9, పమ్మి, పెద్దగోపతిలో 41,8, పల్లెగూడెంలో 41.6, చింతకానిలో 41.5, రావినూతలలో 41.3, ఖమ్మం ప్రకాష్‌నగర్‌లో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు మంగళవారం సాయంత్రం నివేదిక విడుదల చేశారు.

విద్యార్థులు తక్కువగా ఉంటే విలీనం

హాస్టళ్ల వివరాలు సేకరిస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: విద్యార్థులు తక్కువగా ఉన్న సంక్షేమ వసతి గృహాలను మూసివేసి సమీపంలోని గురుకులాల్లో విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. మండల, గ్రామీణ ప్రాంతాల్లోని వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో నిర్వహణ భారంగా మారుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగా జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమశాఖల హాస్టళ్లలో 20మంది కన్నా తక్కువ విద్యార్థులు ఉన్న వాటి వివరాలు పంపించాలని ఉన్నతాధికారులను ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. దీంతో బీసీ సంక్షేమ శాఖ అధికారులు జిల్లాలో బీసీ ప్రీమెట్రిక్ వసతిగృహాలు 22కు గాను బనిగండ్లపాడు, ఏన్కూరు, ముదిగొండ వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నట్లు గుర్తించారని తెలిసింది. ఇక ఎస్సీ సంక్షేమశాఖలో 41ప్రీమెట్రిక్ వసతిగృహాలకు గాను బేతుపల్లి గంగారం వసతిగృహంలో విద్యార్థులు తక్కువగా ఉన్నట్లు తేలగా, గిరిజన సంక్షేమశాఖ పరిధిలోని తొమ్మిది ప్రీమెట్రిక్ హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య బాగానే ఉందని నివేదిక ఇచ్చారని సమాచారం.

సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా



వీసీలో సీపీ విష్ణు ఎస్.వారియర్, జిల్లా అధికారులు

ఖమ్మంక్రైం: అక్రమ రవాణా జరగకుండా జిల్లా సరిహద్దులోని చెక్ పోస్టుల్లో 24 గంటల పాటు పటిష్టమైన నిఘా ఏర్పాటుచేశామని పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో పండించిన వరి ధాన్యాన్ని తెలంగాణలోని కేంద్రాలకు తీసుకురాకుండా నిరోధించడంపై మంగళవారం డీజీపీ అంజనీకుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ సరిహద్దు జిల్లాల్లోకి నిబంధనలకు విరుద్ధంగా వరి ధ్యాన్యం, మద్యం అక్రమ రవాణా చేయకుండా పది చెక్ పోస్టులు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌రావు, అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జి.జనార్దన్‌రెడ్డి, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ జి.గణేష్, జిల్లా ఎక్సైజ్ అ ఆధికారి జి.నాగేంద్రరెడ్డి, ట్రెయినీ ఐపీఎస్ అవినాష్‌కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు బి.నాగేందర్, నరసింహారావు, ఏసీపీ ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని పాలించే శక్తి కమ్యూనిస్టులది..

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- చింతకాని మండలానికి చేరిన ప్రజాపోరు యాత్ర



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు, పక్కన ఎమ్మెల్సీ మధు తదితరులు

చింతకాని: దేశాన్ని పాలించే శక్తి.. ప్రధాని అయ్యే సామర్థ్యం కమ్యూనిస్టులకు ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. పార్టీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ప్రజా పోరుయాత్ర చింతకాని మండలం కొదుమూరుకు చేరుకోగా, మంగళవారం రాత్రి నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. సీపీఐకి సీట్లు లేవని పార్టీ జాతీయ హోదాను ప్రధాని మోదీ రద్దు చేశారని.. కానీ వందేళ్ల చరిత్ర కలిగిన సీపీఐ మనిషి, సృష్టి ఉన్నంత కాలం ఉంటుందని స్పష్టం చేశారు. దేశంలో 34 శాతం ఓట్లతో అధికారంలోకి వచ్చిన మోదీ భారత రాజ్యాంగ పీఠికకు తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. మోదీ పాలనలో అసమానతలు పెరిగిపోగా, మతోన్మాదంతో కులమతాల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆరోపించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే హక్కు మోదీకి ఎవరు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. మోదీ పాలనలో అక్రమాలను ప్రశ్నించినందుకే ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌తో పాటుగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తదితరులపై కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, సీపీఐ వేర్వేరే అయినా బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతుండడంతో అంశాల ప్రాతిపదికన బీఆర్‌ఎస్‌తో పొత్తు పెట్టుకుంటున్నామని తెలిపారు. అంతేతప్ప పదవుల కోసం కమ్యూనిస్టులు అమ్ముడుపోరని స్పష్టం చేశారు. బీజేపీ హటావో – దేశ్‌కీ బచావో నినాదంతో సీపీఐ ఆధ్వర్యాన చేపట్టిన ప్రజా పోరుయాత్ర ద్వారా కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరిస్తున్నట్లు కూనంనేని తెలిపారు. కాగా, ఉమ్మడి జిల్లా నుంచి బీఆర్‌ఎస్ నేతలెవరినీ అసెంబ్లీ గేటు తాకనివ్వనని చెబుతున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఆ ధైర్యం ఎవరు ఇచ్చారో చెప్పాలని సూచించారు.

కమ్యూనిస్టు సిద్ధాంతం అజేయం

ప్రజా పోరుయాత్రకు సంఘీభావం తెలిపిన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ తాను గతంలో కమ్యూనిస్టు పార్టీలో పనిచేశానని గుర్తు చేశారు. పేదల కోసం నికరంగా పనిచేసేది కమ్యూనిస్టు పార్టీయేనని, కమ్యూనిస్టు సిద్ధాంతాలు ఎప్పటికీ అజేయంగా ఉంటాయని తెలిపారు. కాగా, ప్రజా పోరుయాత్రకు బీఆర్‌ఎస్, సీపీఎం నాయకులు కూడా సంఘీభావం తెలిపారు. ఈ సభలో సీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జెడ్పీటీసీ పర్చగాని తిరుపతి కిషోర్, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, సర్పంచ్ నక్కనబోయిన సుజాతతో పాటు సీపీఐ, బీఆర్‌ఎస్, సీపీఎం నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఏపూరి లత, కొండపర్తి గోవిందరావు, ఏపూరి రవీంద్రబాబు, బెడవాడ రవిబాబు, తాటి వెంకటేశ్వర్లు, దూసరి శ్రీరాములు, పావులూరి మల్లికార్జున్‌రావు, అబ్బూరి మహేష్, దూసరి గోపాలరావు, గురిజాల హనుమంతురావు, నారపోగు హేమ, పెంట్యాల పుల్లయ్య, మడుపల్లి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

పాలేరుకు జలకళ!



మండు వేసవిలోనూ మండలంలోని పాలేరు రిజర్వాయర్ నిండుకుండలా కళకళలాడుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా మంగళవారానికి 22.65 అడుగులకు చేరి జలకళ సంతరించుకుంది. రిజర్వాయర్ నిండుగా ఉండటంతో పర్యాటకులను ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం రిజర్వాయర్‌కు సాగర్ జలాశయం నుంచి 4,005 క్యూసెక్కుల నీరు చేరుతుండగా రిజర్వాయర్ నుండి జిల్లాలోని ఆయకట్టుకు 3,460 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అలాగే, పాలేరు కాల్వకు మరో 210 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. – కూసుమంచి

క్లుప్తంగా

'వందే భారత్' ప్రజల ఆస్తి



బోనకల్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

బోనకల్: వందేభారత్ రైలు ప్రజల ఆస్తి అని.. దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రైల్వే శాఖ అధికారి శేఖర్ ముకుంద్ నాయక్ తెలిపారు. ఇటీవల వందేభారత్ రైలుపై రాళ్ల దాడులు జరుగుతున్న నేపథ్యాన ట్రాక్ వెంట ఉన్న ప్రాంతాల ప్రజలకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఈమేరకు మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో శేఖర్ మాట్లాడారు. ప్రయాణికులను వేగంగా గమ్యస్థానాలకు చేరేందుకు ఏర్పాటుచేసిన వందేభారత్ రైలుపై రాళ్లు వేస్తుండడంతో ఆస్తి, ప్రాణనష్టం జరిగే అవకాశముందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ ఎస్సై పి.శ్రీనివాసరావు, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

ఖమ్మం సీపీని కలిసిన జీఎం



సీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న జీఎం

ఇల్లెందు: కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి గ్రామంలో ఈ నెల 29న పర్యావరణ అంశంపై ప్రజాభిప్రాయ సేకరణ సభ జరగనుంది. ఈ మేరకు ఖమ్మం పోలీసు కమిషనర్ విష్ణు ఎస్. వారియర్‌ను ఇల్లెందు ఏరియా సింగరేణి జీఎం షాలేము రాజు మంగళవారం కలిసి మాట్లాడారు. 21 ఇంక్లయిన్ భూగర్భగనిని ఓసీగా మార్చడం, జేకేఓసీ-5 విలీనం తదితర అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణకు సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పిన ఆయన భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. ఆయన వెంట సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే



మంత్రి కేటీఆర్‌కు ప్రసాదం అందజేస్తున్న ఎమ్మెల్యే

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ కోరారు. ఇటీవల తిరుమల వెళ్లి వచ్చిన ఎమ్మెల్యే మంగళవారం కేటీఆర్‌ను కలిసి ప్రసాదం అందజేశారు. ఆతర్వాత వైరాలో అభివృద్ధి పనుల ప్రతిపాదనలు సమర్పించి నిధులు కేటాయించాలని కోరారు.

రైతుల 'పంట' పండింది!



నేలకొండలపల్లి : ధాన్యం బస్తాల వద్ద మంగాపురం తండా రైతు గోవిందరావు

- కొత్త వంగడాలతో దిగుబడి సాధించిన అన్నదాతలు
- నేలకొండపల్లి, కూసుమంచి రైతుల విజయం

నేలకొండపల్లి: కొత్త వరి వంగడం ఎంచుకున్నాడు.. కుటుంబ సభ్యులుగా ఆరుగాలం శ్రమించి పంట సాగు చేస్తే వారి కష్టం వృథా కాలేదు. ఎకరానికి ఏకంగా 52 బస్తాలు దిగుబడి రావడంతో ఆ రైతు ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. నేలకొండపల్లి మండలం మంగాపురం తండాకు చెందిన భూక్యా గోవిందరావు ఐదు ఎకరాల్లో వరి సాగు చేశాడు. ఖమ్మంలో ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన హెచ్‌ఎంటీ విత్తనాలు ఎంచుకోగా, రెండు రోజుల క్రితం మూడున్నర ఎకరాల వరకు కోతలు కోశాడు. సాధారణంగా ఎకరానికి 30నుంచి 35 బస్తాల వరకు వచ్చే దిగుబడి 52 బస్తాలు రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నాడు. ఇదే గ్రామంలో ఎకరం 45 బస్తాల చొప్పున దిగుబడి సాధించిన రైతులు పలువురు ఉండగా, మిగతా రైతులు ఆదర్శంగా తీసుకోవాలని సర్పంచ్ భూక్యా సుధాకర్ కోరారు.

కొత్త వంగడం.. దిగుబడి అదుర్స్



కూసుమంచి : పాలేరులో శ్రీనివాస్ సాగు చేసిన వరి పొలం

కూసుమంచి: మండలంలోని పాలేరుకు చెందిన రైతు దాసరి శ్రీనివాస్ సాగు చేసిన వరి దిగుబడి గణనీయంగా నమోదైంది. గత వానాకాలం నిజామాబాద్ ఆర్‌డీఆర్ పరిశోధన కేంద్రంలో ఉత్పత్తి చేసిన 1200 రకాన్ని శ్రీనివాస్ సాగుచేయగా గణనీయమైన దిగుబడి లభించింది. దీంతో అక్కడి శాస్త్రవేత్తల సహకారంతో ఈసారి యాసంగిలో 1162 రకం వంగడాన్ని సాగుచేయగా మంచి ఫలితాలు వచ్చాయి. ఈ వంగడంతో సాంబ కన్నా సన్న గింజ రావడంతో పాటు కంకికి 450 గింజలు ఉన్నాయని శ్రీనివాస్ తెలిపారు. అంతేకాక దోమపోటు, సుడిదోమ తెగుళ్లు ఆశించలేదని, ఎకరాకు 8 కిలోల విత్తనాలు వెదజల్లే పద్ధతిలో సాగుచేయగా తక్కువ పెట్టుబడితోనే 60 బస్తాల మేర దిగుబడి వస్తుందని భావిస్తున్నాడని చెప్పారు.

నిరాధారమైన ఆరోపణలు చేయొద్దు

- సీఎంపై పొంగులేటివి అన్నీ తప్పుడు విమర్శలే
- ఎమ్మెల్సీ తాతా మధుసూదన్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధు, పక్కన మేయర్ నీరజ తదితరులు

ఖమ్మం వైరారోడ్ : ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కమీషన్ ఇచ్చానంటూ తన రాజకీయ మనుగడ కోసం నిరాధారమైన ఆరోపణలు చేస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి గుణపాఠం తప్పదని ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ హెచ్చరించారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయ మంగళవారం మాట్లాడారు. ఏ పార్టీలోకి వెళ్లాలో తెలియక ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్న పొంగులేటికి ప్రజలు తప్పక గుణపాఠం నేర్పుతారన్నారు. చీమలపాడు ఘటనను రాజకీయ లబ్ధికి ఉపయోగించుకోవాలని ఆలోచిస్తున్న ఆయన ప్రజాసేవకు అనర్హుడని విమర్శించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీతారామ ప్రాజెక్టును సైతం హేళన చేసిన ఆయన టెండర్ ఎందుకు వేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డీసీఎంఎస్, సుడా చైర్మన్లు రాయల శేషగిరిరావు, బచ్చు విజయ్‌కుమార్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు నల్లమల్ల వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ నగర, ఖమ్మం రూరల్ అధ్యక్షులు పగడాల నాగరాజు, బెల్లం వేణుతో పాటు చింతనిప్పు కృష్ణచైతన్య, కమర్తపు మురళి, బొమ్మెర రామ్మూర్తి, ఉప్పల వెంకటరమణ, నరేందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రేణుకాచౌదరి తీరు సరికాదు

కారేపల్లి: మేకప్ పోతుందని కారు దిగని కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి చీమలపాడు ఘటనను రాజకీయం చేయడం గర్హనీయమని తాతా మధు అన్నారు. మండలంలోని గేటుకారేపల్లిలో చీమలపాడు ఘటనలో గాయపడిన తేళ్ల శ్రీనివాసరావును పరామర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. వీలైతే ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలే తప్ప శవ రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. చీమలపాడు ఘటనలో మృతి చెందిన వారికి రూ.10లక్షలు సాయం ప్రకటించగా, త్వరలోనే మంజూరవుతాయని తాతా మధు చెప్పారు. ఇక చనిపోయిన కుటుంబాలకు ఆర్థిక సాయంతో పాటు ఒకరికి ఉద్యోగం, డబుల్ బెడ్ రూం ఇల్లు ఇవ్వడంతో పాటు కాళ్లు కోల్పోయిన ముగ్గురికి ఆర్థిక సాయంతో పాటు కృత్రిమ కాళ్ల ఏర్పాటుకు కృతనిశ్చయంతో ఉన్నామని స్పష్టం చేశారు. ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుతో పాటు నాయకులు ఉప్పల వెంకన్న, పెద్దబోయిన ఉమాశంకర్, శ్రీనివాసరావు, ముత్యాల సత్యనారాయణ, వెంకటఅప్పారావు, అజ్మీరా వీరన్న, బాగం నాగేశ్వరరావు, ధరావత్ మంగీలాల్, ధరావత్ పాండ్యానాయక్, అడ్డగోడ ఐలయ్య, భూక్యా కుమార్, పిల్లి వెంకటేశ్వర్లు, మాలోతు కిషోర్, వాంకుడోతు నరేష్ పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి దాతల చేయూత

సాక్షి ఎఫెక్ట్..



క్రిస్టోఫర్ తండ్రితో ఫోన్‌లో మాట్లాడుతున్న సబ్ రిజిస్టార్ బాలాజీ

పెనుబల్లి: మండలంలోని గంగదేవిపాడు గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ సానిక చెన్నారావు కుమారుడు క్రిస్టోఫర్ బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతుండగా ఆయన చికిత్స కోసం దాతలు చేయూతనిస్తున్నారు. క్రిస్టోఫర్ పరిస్థితిపై ఈనెల 10న 'సాక్షి'లో 'మా బిడ్డకు బతుకు ఇవ్వండి' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో ఎన్టీఆర్ కృష్ణా జిల్లా మైలవరం సబ్ రిజిస్ట్రార్ బానోతు జగన్ రూ.50వేలు, జగ్గయ్యపేట సబ్ రిజిస్టార్ బాలాజీనాయక్ రూ.21 వేలు, ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే, చికిత్స సమయాన మరింత నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ.లక్ష మేర ఆర్థిక సాయం అందిందని క్రిస్టోఫర్ తండ్రి చెన్నారావు మంగళవారం తెలిపారు.

బెటాలియన్‌లో యోగా శిక్షణ



యోగా శిక్షణ పొందుతున్న ఉద్యోగులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో శ్రీరామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్‌నెస్ ఆధ్వర్యాన మంగళవారం యోగా శిక్షణ ఏర్పాటుచేశారు. శిక్షణను బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ బాషా ప్రారంభించి మాట్లాడుతూ యోగా సాధనతో ఆరోగ్యం దరి చేరుతుందని తెలిపారు. సహాయ దళాధిపతి ఎం.ఉదయ్ భాస్కర్‌రావు, రామచంద్ర మిషన్ సభ్యులు కే.పీ.రెడ్డి, రమణ, శ్రీనివాసరెడ్డి, రోశయ్య, మనస్విని, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని దీవించండి..

- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య
- రూ.85.73 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



సత్తుపల్లిలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

సత్తుపల్లిటౌన్ : సంక్షేమ పథకాలు అమలులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని మరోమారు ప్రజలు దీవించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కోరారు. సత్తుపల్లిలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో 183 మంది లబ్ధిదారులకు రూ.85.73 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశాక ఆయన మాట్లాడారు. అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందిన వారు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్‌తో ఆదుకుంటోందని తెలిపారు. కాగా, బీఆర్‌ఎస్ అభ్యర్థులను అసెంబ్లీ గేటు తాకనిచ్చేది చెబుతున్న కొందరు... అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవడమే తప్పా అనేది చెప్పాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్లు కూసంపూడి మహేష్, తోట సుజలరాణి, ఎంపీపీ దొడ్డా హైమావతితో పాటు కొత్తూరు ఉమామహేశ్వరరావు, వనమా వాసు, ఎస్.కే.రఫీ, యాగంటి శ్రీనివాసరావు, చల్లగుండ్ల కృష్ణయ్య, పగుట్ల వెంకటేశ్వరరావు, వల్లభనేని పవన్, ఎస్.కే.చాంద్‌పాషా, అద్దంకి అనిల్, వేములపల్లి మధు పాల్గొన్నారు.

తొలుత ఏ పార్టీలోకి వెళ్తారో చెప్పాలి

తల్లాడ: ఏ పార్టీలోకి వెళ్తారో చెప్పాక బీఆర్‌ఎస్‌పై మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శలు చేయాలని ఎమ్మెల్యే వెంకటవీరయ్య సూచించారు. తల్లాడలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాక సొసైటీ అధ్యక్షుడు రెడ్డెం వీర మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలవనివ్వనని ఆయన చెబుతున్నప్పటికీ తాము చేసిన అభివృద్ధే గెలిపిస్తుందని అన్నారు. అనంతరం 37 మందికి రూ.15,67,500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ దిరిశాల ప్రమీల, తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీఓ రవీంద్రరెడ్డితో పాటు రామచంద్రరావు, నాగబాబు, తాజుద్దీన్, డి.వెంకట్‌లాల్, డి.భద్రరాజు, దిరిశాల దాసురావు, దగ్గుల శ్రీనివాసరెడ్డి, శీలం కోటారెడ్డి, ఐలూరి లక్ష్మి, నర్సింహారావు, కిరణ్‌బాబు, రుద్రాక్ష బ్రహ్మం, రాజశేఖర్ రెడ్డి, గుండ్ల వెంకటి, ఆశీర్వాదం పాల్గొన్నారు.

సాగర్ కాల్వలో వ్యక్తి గల్లంతు

ఖమ్మంరూరల్: మండలంలోని పల్లెగూడెం సాగర్ కాల్వ లాకుల వద్ద మంగళవారం ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. ఖమ్మం రమణగుట్టకు చెందిన మణికుమార్ (30) కరుణగిరి సమీపంలో ఉన్న సాగర్ కాల్వలో ఈత కోసం దిగాడు. అయితే, నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఆయన కొట్టుకుపోయాడు. స్థానికుల నుంచి అందిన సమాచారంతో పోలీసులు గజ ఈతగాళ్లతో గాలించినా రాత్రి పొద్దుపోయే వరకు ఆచూకీ తెలియరాలేదు.

శుభ్రత, పోషకాహారంతోనే ఆరోగ్యం



వైద్యపరీక్షలను పరిశీలిస్తున్న మేనేజర్ రమణ

రఘునాథపాలెం: ప్రతి ఒక్కరు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూనే పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యం సొంతమవుతుందని జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ సీహెచ్‌వీ.రమణ పేర్కొన్నారు. మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షల కోసం వచ్చిన మహిళలకు ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలరు. వైద్యులు సంధ్య, మౌర్య, స్వాతితో పాటు సిబ్బంది శ్రీనివాస్, నర్సయ్య, రజని, ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

నాగులవంచలో పట్టపగలే చోరీ



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

చింతకాని: మండలంలోని నాగులవంచలో బోనకల్-ఖమ్మం ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఇంట్లో మంగళవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన పరిటాల వీరాంజనేయులు కుటుంబసభ్యులతో సహా పొలం పనులకు వెళ్లగా దుండగులు ఇంటి వెనక తలుపుల తాళాలు పగులగొట్టి ప్రవేశించారు. ఇంట్లోని బీరువాలో భద్రపర్చిన రూ.4,800 నగదుతో పాటు రూ.2లక్షల విలువైన బంగారు ఆభరణాలను చోరీ చేశారు. పొలం నుంచి వచ్చిన వీరాంజనేయులు తలుపులు తెరిచి ఉండటంతో బీరువాలో పరిశీలించగా చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈమేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్సై పొదిల వెంకన్న పరిశీలించి కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

ఎండవేడితో పందెం కోడిపిల్లలు మృతి



చనిపోయిన కోడిపిల్లలతో మల్లయ్య

ఖమ్మంక్రైం: డబ్బాలో తీసుకొచ్చిన 400కు పైగా పందెం కోడిపిల్లలు ఎండ వేడి కారణంగా మృత్యువాత పడ్డాయి. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ప్రాంతంలో కోళ్లఫాం నడుపుతున్న మల్లయ్య ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు నుంచి వివిధ రకాల కోడిపిల్లలను దిగుమతి చేసుకుని పెద్దవయ్యాక విక్రయిస్తుంటాడు. ఇందులో భాగంగానే చిత్తూరులో కేంద్రం నిర్వాహకులకు ఫోన్‌లో ఇచ్చిన సూచనల మేరకు 500 పందెం కోడిపిల్లలను డబ్బాల్లో గుంటూరుకు తీసుకొచ్చి అక్కడి నుంచి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలులో పంపించారు. అయితే, ఖమ్మం వచ్చేసరికి ఎండవేడి కారణంగా ఇందులో 400కు పైగా కోడిపిల్లలు మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా రోదించాడు. అటు కోడిపిల్లలు చనిపోగా, రైల్వే హమాలీలు డబ్బాకు రూ.100 వసూలు చేయడంతో రూ.50వేలకు పైగా నష్టం వాటిల్లిందని వాపోయాడు.

కాంటా వేసిన 30బస్తాల ధాన్యం చోరీ

నేలకొండపల్లి: ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటను అమ్మకానికి సిద్ధం చేసిన రైతులు.. వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చొచ్చని భావిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు ధాన్యాన్ని చోరీ చేయడంతో ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పైనంపల్లికి చెందిన రైతు బీమాల నారాయణ వరి సాగు చేయగా, ధాన్యాన్ని రామచంద్రాపురం రహదారి వెంట ఆరబెట్టారు. ఈమేరకు సోమవారం సాయంత్రం 30 క్వింటాళ్లను స్థానిక వ్యాపారికి విక్రయించగా, కాంటా పూర్తయ్యాక చీకటి పడడంతో ఇంటికి వెళ్లారు. మంగళవారం ధాన్యం డబ్బులు వస్తాయని సంతోషిస్తుండగా, తెల్లారేసరికల్లా ధాన్యాన్ని దుండగులు చోరీ చేశారు. దీంతో రైతు కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది.

మార్ట్‌గేజ్ రుణాలు వచ్చేలా చూడండి

- రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శిని కోరిన తుమ్మల

ఖమ్మంమయూరిసెంటర్: ఏజెన్సీ ప్రాంత వాసులకు మార్ట్‌గేజ్ రుణాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి నవీన్ మిట్టల్‌ను కోరారు. గండుగులపల్లిలోని ఆయన నివాసంలో మంగళవారం ఏజెన్సీ ప్రాంత రైతులు కలిశారు. గత రెండేళ్లుగా మార్ట్‌గేజ్ రుణాలు రావడం లేదని, దీంతో ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. దీంతో తుమ్మల నవీన్ మిట్టల్‌కు ఫోన్ చేసి ఈ సమస్య పరిష్కారం అయ్యేలా కలెక్టర్, డీసీసీబీ అధికారులను ఆదేశించాలని కోరారు. దీనికి నవీన్‌మిట్టల్ సానుకూలంగా స్పందించారు.

ఆస్తిపన్ను చెల్లిస్తే రాయితీ

ఖమ్మంమయూరిసెంటర్: ఈనెలలో ఆస్తిపన్ను చెల్లిస్తే ఐదు శాతం రాయితీ లభిస్తుందని ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన ఎర్లీ బర్డ్ పథకం ద్వారా రాయితీ అందుకోవాలని సూచించారు. ఖమ్మం ద్వారకానగర్‌కు చెందిన కె.గుర్నాథరావు ఈ ఆర్థిక సంవత్సరం రూ.5,33,098 ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉండగా రాయితీతో రూ.4,52,180 చెల్లించగా ఆయనను కమిషనర్ అభినందించారు. ఈ అవకాశాన్ని నగర వాసులంతా సద్వినియోగం చేసుకోవాలని ఓ ప్రకటనలో సూచించారు.

ఇంటిస్థలం విషయంలో ఘర్షణ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 4వ డివిజన్ యూపీహెచ్ కాలనీలో ఇంటిస్థలం విషయమై బంధువులు వర్గాలుగా విడిపోయి మంగళవారం ఘర్షణ పడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ స్థలవివాదం కోర్టులో ఉండగా, ఓ వర్గం వారు ఆక్రమిస్తున్నారని మరో వర్గం వారు రావడంతో ఘర్షణ జరిగింది. దీంతో ఇద్దరికి గాయాలు కాగా, పోలీసులు సర్ది చెప్పి పంపించినట్లు తెలిసింది. అయితే, ఫిర్యాదు అందలేదని ఖమ్మం అర్బన్ సీఐ శ్రీహరి తెలిపారు.

యువకుడిపై దాడి.. కేసు

ఖమ్మంక్రైం: యువకుడిపై దాడి ఘటనలో పలువురిపై ఖమ్మం టూ టౌన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. కామేపల్లి మండలం బర్లగూడెంకు చెందిన బానోతు కిషోర్ సోమవారం రాత్రి ఖమ్మం వచ్చి వెళ్తుండగా కొత్త బస్టాండ్ వద్ద మూడ్ సాయి, ధరావత్ సైదా తదితరులు దాడి చేశారు. బాధితుడి తండ్రి సక్రు మంగళవారం చేసిన ఫిర్యాదుతో కేసు నమోదైంది.

క్లుప్తంగా...

విప్లవోద్యమం సజీవంగా ఉంటుంది

సీపీఐ(ఎంఎల్) జనశక్తి అగ్రనేత కూర రాజన్న

సిరిసిల్ల/చంచల్‌గూడ: తెలంగాణలో ప్రస్తుతం విప్లవోద్యమం బలహీనపడినా.. అది నిరంతరం సజీవంగానే ఉంటుందని, అది మళ్లీ ఎగసిపడుతుందని సీపీఐ(ఎంఎల్) జనశక్తి అగ్రనేత కూర రాజన్న అలియాస్ రాజేందర్ అన్నారు. ఈ ప్రమాదాన్ని గుర్తించే రాజ్యం తమను వెంటాడుతోందన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన ఓ హత్య కేసులో అరెస్టయిన రాజన్న కొన్ని నెలలుగా చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో జైలు నుంచి విడుదలయ్యారు. అనంతరం ఆయన సిరిసిల్లలో మీడియాతో మాట్లాడుతూ.. దిద్దుబాటు కేంద్రాలుగా ఉండాల్సిన జైలులో మానహక్కుల హననం జరుగుతోందన్నారు. అండర్ ట్రయల్‌లో ఉన్న వారికి అనారోగ్య సమస్యలు వస్తే, ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి చూపించే పరిస్థితి లేదన్నారు. సమావేశంలో రాజన్న సోదరుడు కూర దేవేందర్ అలియాస్ అమర్, విమలక్క తదితరులు పాల్గొన్నారు. కాగా, సుద్దాల మాజీ సర్పంచ్ ఏనుగు వేణుగోపాల్‌రావు అలియాస్ ప్రభాకర్‌రావు హత్య కేసులో నిందితుడిగా ఉన్న విశ్వనాథ్‌కు బెయిల్ ఇచ్చేందుకు జిల్లా కోర్టు నిరాకరించింది. దీంతో ఆయనను సిరిసిల్ల నుంచి మళ్లీ జైలుకు తీసుకెళ్లారు.

బంగారు ఇళ్లు ఎక్కడ?

గ్రామాల్లో నాకన్నీ గుడిసెలే కన్పిస్తున్నాయి: సీఎల్పీ నేత భట్టి ఎద్దేవా

- ఒక్క కేసీఆర్ కుటుంబమే బంగారుమయం అయ్యిందని విమర్శ

సాక్షి, పెద్దపల్లి: 'నేను పాదయాత్రలో ప్రతి గ్రామం చూస్తున్నా. ఏ ఒక్క ఇల్లు కూడా బంగారంలా కనిపించడం లేదు. అన్నీ గుడిసెలే కనిపిస్తున్నాయి. మరి సీఎం కేసీఆర్ చెబుతున్న బంగారు ఇళ్లు ఎక్కడున్నాయి? కేసీఆర్ తెలంగాణను బంగారం చేస్తే పేదలు ఇంకా గుడిసెల్లోనే ఎందుకు బతుకుతున్నారు? రాష్ట్రంలో నాలుగు కోట్ల ప్రజలకు చెందాల్సిన సంపదను నలుగురే దోపిడీ చేస్తున్నారు. కేవలం కేసీఆర్ కుటుంబం మాత్రమే బంగారుమయమైంది. ఆయన తన ఇల్లు చూసుకుని రాష్ట్రంలో ప్రతి ఇల్లూ ఇలాగే ఉందని అనుకుంటున్నట్టుంది..'అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క విమర్శించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా భట్టి చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మంగళవారం పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం, పెద్దపల్లిలో కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు.



మాట్లాడుతున్న భట్టి విక్రమార్క. చిత్రంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి.

■ రైతులు ఇబ్బందులు పడుతుంటే ఏం చేస్తున్నారు?

ధాన్యం కొనుగోలు విషయంలో రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడుతుంటే ఈ ప్రభుత్వం ఏం చేస్తోందని భట్టి ప్రశ్నించారు. రూ.1.25 లక్షల కోట్లతో నిర్మించిన కాళేశ్వరంతో ఉపయోగం ఏంటో సర్కారు సమాధానం ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించకుండా జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం స్తంభంపల్లి శివారులో కాలుష్య కారకమైన ఇథనాల్ కంపెనీ ఏర్పాటును తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బాధితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

■ ఇంకా రేకుల షెడ్లలోనే చదువులు..

రూ.2.90 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న రాష్ట్రంలో విద్యార్థులు ఇంకా రేకుల షెడ్లలో చదవడం ఏంటంటూ.. ధర్మారం మండలం రచ్చపల్లి ప్రాథమిక పాఠశాల దుస్థితిపై భట్టి ప్రభుత్వాన్ని నిలదీశారు. 'మన ఊరు మనబడి'పథకం గొప్పగా తీసుకొచ్చామని ప్రచారం చేసుకుంటున్న ప్రభుత్వం పాఠశాలల తరగతి గదుల నిర్మాణాన్ని పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. విద్యాశాఖమంత్రి జిల్లాల్లో పర్యటించి వాస్తవ విషయాలు తెలుసుకుంటే బాగుంటుందని సూచించారు. ఉపాధ్యాయుల కొరతను భర్తీ చేయడానికి వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ వేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తుందని భట్టి హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయ రమణారావు, డీసీసీ అధ్యక్షులు మక్కాన్‌సింగ్, లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేతల బల ప్రదర్శన

భట్టి పాదయాత్ర పెద్దపల్లి నియోజకవర్గంలోకి ప్రవేశించే పాలితం వద్ద కాంగ్రెస్ నేతలు బలప్రదర్శనకు దిగారు. మొదట విజయ రమణారావు ఆయనకు ఘన స్వాగతం పలకగా, అనంతరం ఓదెల జెడ్పీటీసీ గంట రాములు తన అనుచరులతో కలిసి స్వాగతం పలికే క్రమంలో ఇరువర్గాల కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా తోపులాట చోటు చేసుకోవడంతో భట్టి జోక్యం చేసుకుని వారిని శాంతింపజేశారు.



భట్టి ముందే గొడవకు దిగుతున్న నాయకులు

25న బీఆర్‌ఎస్ జెండా పండుగ

- 19వేల జనావాసాల్లో ఎగురవేయాలి
- అదే రోజు నియోజకవర్గ కేంద్రాల్లో పార్టీ ప్రతినిధుల సభలు
- పార్టీ పనితీరుపై ఆ సభల్లో చర్చించుకోవాలి: మంత్రి కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అభివృద్ధి, ప్రభుత్వపరంగా ప్రజలకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ పనితీరుపై ఈ నెల 25న జరిగే నియోజకవర్గ స్థాయి పార్టీ ప్రతినిధుల సభల్లో చర్చించుకోవాలని భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీ రామారావు పిలుపునిచ్చారు. ప్రతినిధుల సభలు పార్టీ నియమించిన ఇన్‌చార్జీలు, స్థానిక ఎమ్మెల్యేల అధ్యక్షతన కొనసాగుతాయని, వాటి నిర్వహణను పార్టీ జిల్లా అధ్యక్షులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో నిర్వహించే కార్యక్రమాలపై పార్టీ శ్రేణులతో కేటీఆర్ మంగళవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. 25న రాష్ట్ర వ్యాప్తంగా 19 వేల జనావాసాల్లో బీఆర్ఎస్ జెండా ఎగరాలని, అన్ని నియోజకవర్గాల్లో గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ఉదయం పూట పండుగ వాతావరణంలో పార్టీ జెండాలు ఎగురవేయాలని పిలుపునిచ్చారు. గ్రామ, వార్డు స్థాయిలో జెండా పండుగ ముగిసిన తర్వాత ఉదయం 10 గంటలకు నియోజకవర్గ కేంద్రాలకు చేరుకుని ప్రతినిధుల సభకు హాజరుకావాలన్నారు.

సమ్మేళనాల నివేదిక ఎప్పటికప్పుడు కేసీఆర్‌కు చేరుతోంది

ఎమ్మెల్సీ మధుసూదనాచారి ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమాల అమలు కమిటీ ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణ తీరుతెన్నులపై పార్టీ అధ్యక్షుడు, సీఎం కె.చంద్రశేఖర్‌రావుకు ఎప్పటికప్పుడు నివేదికలు అందిస్తోందని కేటీఆర్ వెల్లడించారు. కాగా, ఆత్మీయ సమ్మేళనాలను విజయవంతం చేసిన నేతలను కేటీ రామారావు ఈ సందర్భంగా అభినందించారు.

కనీసం 3 వేల మందితో ప్రతినిధుల సభ

కనీసం 3 వేల నుంచి 3500 మంది ప్రతినిధులతో ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో సభ నిర్వహించాలని పార్టీ ఇన్‌చార్జీలు, ఎమ్మెల్యేలకు సూచించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తలు తీసుకోవాలనీ, సమావేశాలకు హాజరయ్యే పార్టీ ప్రతినిధులకు భోజనాలు, ఇతర వసతులను సమకూర్చాలని కోరారు. అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని బీఆర్ఎస్ గ్రామ, వార్డు శాఖల అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సింగిల్ విండో చైర్మన్లు, మార్కెట్ కమిటీల డైరెక్టర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, జెడ్పీ చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మేయర్లు, పురపాలక సంఘాల చైర్‌పర్సన్లను ఆహ్వానించాలన్నారు. వీరితో పాటు పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్లు, నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జెడ్పీ చైర్మన్లు, పార్టీ సీనియర్ నేతలు హాజరయ్యేలా సమన్వయం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జీలను ఆదేశించారు.

నకిలీ బిల్లులపై విచారణ

ఖమ్మం వినాయక ఆస్పత్రిలో తనిఖీ

ఖమ్మం వైద్యవిభాగం: సీఎం సహాయనిధి నుంచి పరిహారం పొందేందుకు వైద్యం చేయకుండానే.. చేసినట్లు తప్పుడు బిల్లులు ఇచ్చారనే ఆరోపణలతో ఖమ్మంలోని శ్రీ వినాయక సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో హైదరాబాద్ పోలీసులు తనిఖీలు చేట్టారు. సచివాలయం ఉద్యోగి డీఎస్ఎన్ మూర్తి ఇచ్చిన ఫిర్యాదుతో ఆస్పత్రి నిర్వాహకులతోపాటు బిల్లులు సమర్పించిన శివపై హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం సీసీఎస్ సీఐ మల్లికార్జున్ ఆధ్వర్యాన పోలీసులతోపాటు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాంబాబు తనిఖీలు చేపట్టారు. నల్లగొండ జిల్లా చలకుర్తికి చెందిన రమావత్ శివ ఈ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నట్లు నకిలీ పత్రాలు సృష్టించి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.1,55,854 బిల్లు తీసుకున్నాడు. ఆయన వినాయక ఆస్పత్రిలో జనరల్ ఫిజీషియన్ రమేష్ వద్ద వైద్యం చేయించుకున్నట్లు బిల్లుల్లో ఉంది. అయితే, అలాంటి వైద్యుడెవరూ తమ వద్ద లేరని నిర్వాహకులు చెప్పడంతో పోలీసులు రికార్డులు తనిఖీ చేశారు.

అటవీభూమిలో చట్టవిరుద్ధంగా ఈద్గా నిర్మాణం

- ఆ స్థలాన్ని ఒకేషనల్ సెంటర్‌కు కేంద్రం కేటాయించిందన్న బండి సంజయ్
- చర్యలు చేపట్టాలని సీఎం కేసీఆర్‌కు లేఖ



సాక్షి, హైదరాబాద్/నిర్మల్: నిర్మల్ జిల్లా చించోలి(బి) పరిధిలోని సర్వేనంబర్లు 543, 544, 969లో ఉన్న అటవీభూమిని చట్టవిరుద్ధంగా ఈద్గాకు కేటాయించి నిర్మాణం చేపట్టారని, దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సీఎం కేసీఆర్‌కు మంగళవారం లేఖ రాశారు. వృత్తి విద్యానైపుణ్యాల అభివృద్ధి కేంద్రం కోసం ఇవ్వాలని గతంలో రాష్ట్రప్రభుత్వం చేసిన అభ్యర్థన మేరకు 3.373 హెక్టార్ల అటవీభూమిని కేంద్రప్రభుత్వం కేటాయించిందని లేఖలో పేర్కొన్నారు. అటవీభూములను సైతం డీనోటిఫై చేసిందే నిరుద్యోగుల భవిష్యత్తు కోసమని, అలాంటి భూమిని స్వార్థరాజకీయాల కోసం ఈద్గాకు కేటాయించడం చట్టవిరుద్ధమన్నారు. ప్రజాఉపయోగ కార్యక్రమాల కోసం ఉపయోగించాల్సిన భూములను ప్రార్థనాస్థలాలకు కేటాయించడానికి వీల్లేదని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. కోర్టుతీర్పులకు వ్యతిరేకంగా ఈద్గాను నిర్మించడమంటే న్యాయవ్యవస్థను అవమానించినట్లేనన్నారు. ఈద్గా నిర్మాణానికి దగ్గరలోనే రెండు హిందూ ఆలయాలున్నా పట్టించుకోలేదని ఆరోపించారు. నిరుద్యోగుల కోసం కేటాయించిన భూమిని ప్రార్థనాస్థలాలకు ఇవ్వడంతోపాటు ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. రాజకీయ స్వార్థప్రయోజనాల కోసం యువత భవిష్యత్తును బలిచేసే చర్యలను బీజేపీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వృత్తివిద్య, నైపుణ్యాల అభివృద్ధి కోసం కేటాయించిన భూమిని అదే ప్రయోజనాల కోసం వినియోగించాలని, లేనిపక్షంలో కోర్టును ఆశ్రయించడంతోపాటు ఆందోళనలకూ సిద్ధమవుతామని సంజయ్ హెచ్చరించారు.

నిబంధనల ప్రకారమే 'ఈద్గా'

సీఎంకు బండి సంజయ్ లేఖ రాయడాన్ని ఖండించిన మంత్రులు



ఈద్గాను ప్రారంభిస్తున్న మంత్రులు మహమూద్ అలీ, ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్/సారంగపూర్: నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం చించోలి(బి) అటవీప్రాంతంలో నిబంధనల ప్రకారమే ఈద్గాను నిర్మించారని హోంమంత్రి మహమూద్ అలీ తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని అటవీప్రాంతంలో పదెకరాల్లో రూ.5 కోట్లతో నిర్మించిన ఈద్గాను మంగళవారం సాయంత్రం మంత్రులు మహమూద్ అలీ, ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం హోంమంత్రి మాట్లాడుతూ.. ఈద్గాపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సీఎంకు లేఖ రాయడాన్ని ఖండించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హిందూ ముస్లింలను సమానంగా చూస్తూ గంగాజమునా తెహజీబ్‌ను కాపాడుతున్నారని తెలిపారు. అయితే.. చించోలి(బి) సమీపంలోని పదెకరాల స్థలం ఒకేషనల్ సెంటర్ కోసం ఇచ్చిందేనని, కానీ నిబంధనల ప్రకారమే ఈద్గాకు తీసుకున్నామని అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. చెట్లు తీసేసినందుకు రూ.82 లక్షలు అటవీశాఖకు చెల్లించామన్నారు. ఈ స్థలానికి బదులుగా ముథోల్ నియోజకవర్గంలో అటవీశాఖకు 20 ఎకరాలు కేటాయించామని వివరించారు. ఒకేషనల్ సెంటర్ పనులనూ చేపడతామని ప్రకటించారు.

ఇది యావత్ తెలుగు విద్యార్థులపై కుట్ర

- నా యూట్యూబ్ చానల్ హ్యాక్ చేశారు
- సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకురాలు బాల లత



పంజగుట్ట (హైదరాబాద్): తన యూట్యూబ్ చానల్‌ను హ్యాక్ చేయడం యావత్ తెలుగు విద్యార్థులపై జరిగిన కుట్ర అని సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకురాలు బాల లత స్పష్టం చేశారు. ఆమె మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ... గత ఆదివారం తెల్లవారుజామున తన యూట్యూబ్ చానల్ హ్యాక్ అయినట్లు గుర్తించానన్నారు. తాను రెండు సార్లు సివిల్ సర్వీసులకు ఎంపికయ్యానని, కానీ విద్యార్థులు, నిరుద్యోగులకు ఏదైనా చేయాలనే లక్ష్యంతో యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించానని వివరించారు. వారికి ప్రేరణ కలిగిస్తూ, పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో వీడియోలు చేసి అప్‌లోడ్ చేస్తున్నానని తెలిపారు. ఎంతోమంది గ్రామీణ విద్యార్థులు, మహిళలు, దివ్యాంగులు, హైదరాబాద్‌కు వచ్చి చదువుకోలేని వారికి, తెలుగులో తాను చేసిన వీడియోలు ఎంతగానో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. తన యూట్యూబ్ చానల్‌లో ఐదు లక్షల మంది వీక్షకులున్నారని తెలిపారు. తన వీడియోలు చూసి ప్రేరణ పొందిన ఎంతోమంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు చెప్పారు. మే 25న సివిల్ సర్వీసెస్ పరీక్షలు, జూన్‌లో యూపీఎస్సీ పరీక్షలున్న నేపథ్యంలో.. ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని వేలాదిమంది ఫోన్ చేసి అడుగుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. హ్యాక్ చేయడమే కాకుండా అందులో గేమింగ్ వీడియోలు పెడుతున్నారని, ఏదైనా తప్పుడు సమాచారం పెడితే విద్యార్థుల భవిష్యత్ ఏమవుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఇప్పటికే సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. కేసును త్వరగా పరిష్కరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అప్పటివరకు విద్యార్థులు నిరాశకు గురికాకుండా వారికి ప్రేరణ, పోటీ పరీక్షలకు అవసరమైన సమాచారం ఇచ్చేందుకు 'BALA LATHA OFFICIAL'అనే కొత్త యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

జిల్లా వార్తలు

నేడు మిర్చి కొనుగోళ్లకు సెలవు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు అంచనాలకు మించి మిర్చిని రైతులు అమ్మకాలకు తీసుకొస్తున్నారు. సోమ, మంగళవారాల్లో భారీగా మిర్చి వచ్చిన నేపథ్యాన కాంటాలు, తరలింపు కోసం బుధవారం మిర్చి కొనుగోళ్లకు సెలవు ప్రకటించినట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం తెలిపారు. ఇక గురువారం అమావాస్య సెలవు కాగా, తిరిగి శుక్రవారం మిర్చి కొనుగోళ్లు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

మొబైల్ పోయిందా.. పట్టేద్దాం ఇలా!

- సీఈఐఆర్ పోర్టల్‌లోకి వెళ్తే 'బ్లాక్'కు అవకాశం
- ఆపై ట్రాకింగ్‌తో గుర్తింపునకు వెసులుబాటు
- వివరాలు వెల్లడించిన ఖమ్మం సీపీ వారియర్



ఖమ్మంక్రైం: ప్రస్తుత సమాజంలో అందరికీ సెల్‌ఫోన్ నిత్యావసర వస్తువుగా మారింది. ఇదే సమయాన సెల్‌ఫోన్ దొంగతనాలు కూడా సర్వసాధారణమయ్యాయి. కొందరు పొరపాటుగా ఫోన్ పోగొట్టుకుంటుంటే.. మరికొందరి నుంచి దుండగులు అపహరిస్తున్నారు. ఈ నేపథ్యాన పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసేందుకు సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్) పోర్టల్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ పోర్టల్ సేవలు, వినియోగించుకునే విధానాన్ని ఖమ్మం పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ మంగళవారం వెల్లడించారు.

కేంద్ర టెలికాం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన..

కేంద్రప్రభుత్వం టెలికాం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన సీఈఐఆర్‌ను తీసుకొచ్చింది. ఇప్పటికే చోరీకి గురైన ఫోన్లను గుర్తించడంలో ఈ పోర్టల్ సేవలను పోలీసు శాఖ ఉపయోగించుకుంటోంది. ఈ పోర్టల్ సేవల కోసం తొలుత www.ceir.gov.in వైబ్‌సైట్‌లో లాగిన్ కావాల్సి ఉంటుంది. అందులో బ్లాక్ స్టోలెన్/లాస్ట్ మొబైల్, అన్ బ్లాక్ ఫౌండ్ మొబైల్, చెక్ రిక్వెస్ట్ స్టేటస్ లింక్‌లు కనిపిస్తాయి. ఈమేరకు ఫోన్ పోగొట్టుకున్న వారు బ్లాక్ స్టోలెన్/లాస్ట్ మొబైల్ లింక్‌లోకి వెళ్లి మొబైల్ ఐఎంఈఐ నంబర్లు, కంపెనీ పేరు, మోడల్‌తో పాటు బిల్లు అప్‌లోడ్ చేయాలి. అలాగే, ఫోన్ ఏ రోజు, ఎక్కడ పోయింది, జిల్లా, రాష్ట్రం, పోలీస్ స్టేషన్ పరిధి వివరాలే కాక వినియోగదారుడి పేరు, చిరునామా, గుర్తింపు కార్డు, ఈమెయిల్, ఓటీపీ కోసం మరో మొబైల్ నంబర్ ఇవ్వాలి. ఇదంతా పూర్తయిన తర్వాత ఒక ఐడీ కేటాయిస్తారు. ఈ ఐడీ ద్వారా చెక్ రిక్వెస్ట్ స్టేటస్ లింక్‌లోకి వెళ్తే ఫిర్యాదు పరిస్థితిని తెలుసుకోవచ్చు.

పోలీసులకు ఉపయోగం

మొబైల్ ఏ కంపెనీదైనా సీఈఐఆర్‌లో వివరాలు నమోదు చేస్తే పోలీసు విచారణకు సులువుగా ఉంటుంది. ఫోన్ చోరీ చేసిన వారు ఎక్కడ ఉపయోగించినా ట్రాకింగ్ ద్వారా గుర్తించేందుకు ఈ వివరాలు ఉపయోగపడతాయి. అంతేకాక ఫోన్‌ను వెంటనే బ్లాక్ చేయడం ద్వారా చోరీ చేసిన వారు దాన్ని ఉపయోగించకుండా చూడొచ్చు. ఇక ఫోన్ దొరికాక మళ్లీ అదే ఐడీ నంబర్ ద్వారా సైట్‌లోని అన్ బ్లాక్ ఫౌండ్ మొబైల్ లింక్‌లోకి వెళ్తే మనం ఉపయోగించుకోవచ్చు.



సీఈఐఆర్ వెబ్‌సైట్ హోం పేజీ

130 ఫోన్ల గుర్తింపు



జిల్లాలో అందిన ఫిర్యాదులపై ఐఎంఈఐ సాయంతోనే కాక కాల్ డేటా రికార్డింగ్, ఇతర సాంకేతిక విధానాలను ఉపయోగించి సుమారు 130 ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించాం. మొబైల్ ఫోన్ పోయిన వెంటనే ఆ పరిధిలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఐఎంఈఐ ఆధారంగా దర్యాప్తు చేస్తారు. ఇక సీఈఐఆర్ వైబ్‌సైట్‌లో పూర్తి సమాచారాన్ని నమోదు చేస్తే త్వరగా ఫోన్‌ను దొరకబట్టడానికి అవకాశం లభిస్తుంది.

– విష్ణు ఎస్.వారియర్, ఖమ్మం పోలీసు కమిషనర్

కేటీపీఎస్‌కు నాణ్యమైన బొగ్గు అందించాలి



సింగరేణి డైరెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఈలు

పాల్వంచ: వేసవిలో విద్యుత్ డిమాండ్ పెరిగిన నేపథ్యాన కేటీపీఎస్ కాంప్లెక్స్‌కు నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలని పాల్వంచలోని కేటీపీఎస్ 5, 6, 7వ దశల సీఈలు ఎం.ప్రభాకర్‌రావు, పి.వెంకటేశ్వరరావు కోరారు. ఈమేరకు కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో మంగళవారం వారు డైరెక్టర్లు ఎన్.వీ.కే.శ్రీనివాస్, జి.వెంకటేశ్వరరెడ్డిని కలిసి బొగ్గు సరఫరా చర్చించారు. డిమాండ్ దృష్ట్యా రైల్వే వ్యాగన్ల సంఖ్య పెంచాలని కోరగా డైరెక్టర్లు సానుకూలంగా స్పందించారు. ఈకార్యక్రమంలో కోల్ ప్లాంట్ ఎస్ఈ జి.రాజ్‌కుమార్, డీఈ ఎస్ఎన్ఎస్.శేఖర్, ఏడీఈ వై.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న స్పెషల్ కమిషనర్



ధ్వజస్తంభం వద్ద హరికిరణ్ దంపతులు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామిని వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరి హరికిరణ్ దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. వీరికి అర్చకులు ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికాక, ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలోని మూలమూర్తులను దర్శించుకుని పూజలు చేశారు. ఆతర్వాత ఉపాలయంలో పండితులు వేదాశీర్వచనంతో పాటు స్వామి వారి జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం, సబ్ కలెక్టర్ కార్యాలయ ఉద్యోగులు అగ్గి రాజు, గణేష్, రాంబాబు, రామరాజు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో పతకం

కొత్తగూడెంఅర్బన్: హెల్తీ సీనియర్ సిటిజన్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పరుగుపందెం పోటీల్లో భద్రాద్రి జిల్లాకు చెందిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కృష్ణయ్య రజత పతకం సాధించారు. 75ఏళ్లు పైబడిన వారికి నిర్వహించిన పోటీల్లో 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెంలో కృష్ణయ్య తృతీయ స్థానంలో నిలవగా తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పతకం అందించి సన్మానించారు. ఈమేరకు కృష్ణయ్యను మంగళవారం కొత్తగూడెంలో ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నప్పయ్య, వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు వెంకట్, శ్రీనివాస్, సారంగపాణి, డాక్టర్ వెంకటేశ్వర్లు, మోహన్, కేహెచ్.ప్రసాద్, సుగుణరావు, వెంకటయ్య, రాజశేఖర్, ముస్తఫా అభినందించారు.



కృష్ణయ్యను సన్మానించిన అసోసియేషన్ సభ్యులు

కేయూ ఎల్ఎల్ఎం పరీక్షల షెడ్యూల్ విడుదల

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎల్ఎల్ఎం ఒకటి, మూడో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్‌ను అధికారులు మంగళవారం విడుదల చేశారు. ఎల్ఎల్ఎం మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25, 27, 29 తేదీల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1 వరకు జరుగుతాయి. అలాగే, మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26, 28, మే 1వ తేదీల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయని పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాలకు చెక్

పాల్వంచ: కర్మాగారాల్లో ఉద్యోగులు, కార్మికులు అప్రమత్తంగా ఉండడం ద్వారా అగ్నిప్రమాదాలు జరగకుండా కాపాడుకోవచ్చని పాల్వంచలోని కేటీపీఎస్ 5, 6వ దశల సీఈ ఎం.ప్రభాకర్‌రావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలల సందర్భంగా మంగళవారం ఫైర్ ఆఫీసర్ ఝెడ్ల శ్రీనివాసులు ఆధ్వర్యాన మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఈ మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున అవగాహన పెంపొందించుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఈలు వి.వెంకటేశ్వర్లు, టి.సత్యనారాయణ, జీ.వీ.ధర్మారావుతో పాటు అధికారులు పి.కృష్ణ, పి.రామారావు, చంద్రశేఖర్, శేషసాయి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సీఈ ప్రభాకర్‌రావు

కోలిండియా వేజ్‌బోర్డ్ సమావేశం వాయిదా

సింగరేణి(కొత్తగూడెం): కోలిండియా కార్మికులకు వేతనాలకు సంబంధించి 11వ వేజ్‌బోర్డ్ 9వ సమావేశం వచ్చే నెలకు వాయిదా పడింది. రెండు రోజుల పాటు నిర్వహిస్తామని ప్రకటించిన సమావేశం కోల్‌కత్తాలో మంగళవారం సమావేశం ప్రారంభమైంది. దీంతో బొగ్గు పరిశ్రమల కార్మికులు ఉత్కంఠగా ఎదురుచూస్తుండగా కోలిండియా చైర్మన్ ప్రమోద్ అగర్వాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం అర్ధాంతరంగా మంగళవారమే ముగిసింది. ఇక 10వ సమావేశం నిర్వహణ తేదీని కూడా ప్రకటించకపోవడం గమనార్హం. కాగా, కోల్‌కత్తాలో జరిగిన సమావేశంలో చైర్మన్ అగర్వాల్ మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ మినిమమ్ గ్యారంటీ బెనిఫిట్(ఎంజీబీ) 19శాతం పెంచగా, కేంద్రప్రభుత్వం ఆమోదించాల్సి ఉందని తెలిపారు. ఇక ఎంజీబీ పెంచిన నేపథ్యాన ఇతర అలవెన్స్‌లు పెంచలేమని చెప్పగా, మస్టర్లతో సంబంధం లేకుండా బోనస్, స్పెషల్ డీఏ కొనసాగింపు, బేసిక్‌పై 3శాతం ఇంక్రిమెంట్ ఇచ్చేందుకు అంగీకరించారు. అలాగే, ఓవర్ టైమ్(ఓటీ) సీలింగ్ అండర్ గ్రౌండ్ వారికి తొలగిస్తామని పేర్కొనడమే కాక అండర్ గ్రౌండ్, నైట్‌షిఫ్ట్, చార్జింగ్, నర్సింగ్ అలవెన్స్‌లపై పలు నిర్ణయాలు వెలువరించారు. ఈసమావేశంలో కోలిండియా డైరెక్టర్(పా) వినయ్ రంజన్, సింగరేణి డైరెక్టర్(పా) ఎస్.బలరామ్, జీఎం పర్సనల్(ఐఆర్‌పీఎం) ఏ.కుమార్‌రెడ్డి, ఏజీఎం పర్సనల్ కవితానాయుడు, కార్మిక సంఘాల నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సింగరేణి డైరెక్టర్ బలరామ్, జీఎం కుమార్‌రెడ్డి

'సదరం'లో దివ్యాంగుల అవస్థలు

మూడు గంటల ఆలస్యంగా వచ్చిన వైద్యులు

సత్తుపల్లిటౌన్: నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు జారీ చేసేందుకు మంగళవారం సత్తుపల్లిలో శిబిరం ఏర్పాటుచేశారు. అయితే, అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దివ్యాంగులు వివిధ ప్రాంతాల నుంచి ఉదయం 9 గంటలకల్లా చేరుకున్నారు. కానీ వైద్యులు 12 గంటల వరకు రాకపోవటంతో నానా అవస్థలు పడాల్సి వచ్చింది. కనీసం అల్పాహారం కూడా ఏర్పాటు చేయకపోవటంతో శిబిరం ముగిశాక ఆకలితోనే మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటి ముఖం పట్టాల్సి వచ్చిందని వాపోయారు. కాగా, ఈ శిబిరంలో 110 మందికి వైద్యులు పరీక్షలు చేయగా, 81మంది సర్టిఫికెట్లకు అర్హులుగా నిర్ధారించారు. క్యాంప్ ఇన్‌చార్జ్ వినయ్‌కుమార్, వైద్యులు హనుమాన్, వెంకటనర్సయ్య, రాంమూర్తి, పవన్, జ్యోతి, ఆదర్శ్, ప్రసన్నకుమార్, నరేష్, సిబ్బంది కిషన్, వీరయ్య పాల్గొన్నారు.



శిబిరంలో రిపోర్టులు పరిశీలిస్తున్న వైద్యులు

ఎస్సెస్సీ 'స్పాట్' కేంద్రంలో తనిఖీ

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం(స్పాట్ వాల్యుయేషన్) జరుగుతుండగా పాఠశాల విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్, స్పాట్ వాల్యుయేషన్ జిల్లా పరిశీలకులు శ్రీనివాసచారి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21వ తేదీ వరకు వాల్యుయేషన్ పూర్తి చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లాకు 2.16లక్షల జవాబుపత్రాలు రాగా. 1.40లక్షల జవాబుపత్రాల మూల్యాంకనం పూర్తయిందని, మిగతావి కూడా గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డీఈఓ సోమశేఖరశర్మ తదితరులు పాల్గొన్నారు. కాగా, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ కూడా టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేశారని డీఈఓ తెలిపారు.

బకాయిల వసూళ్లపై దృష్టి

హన్మకొండ: విద్యుత్ బిల్లులకు సంబంధించి మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు అధికారులకు సూచించారు. హనుమకొండలోని ప్రధాన కార్యాలయంలో మంగళవారం వరంగల్, మహబూబాబాద్ జిల్లాల ఎస్ఈలు, డీఈఈలు, ఎస్ఏఓలతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎండీ మాట్లాడుతూ రూ.50 వేలకు పైబడిన బకాయిల వసూళ్లపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మీటర్ రీడింగ్ తరచుగా తనిఖీ చేస్తూ అంతరాయాలు తగ్గించుకోవాలన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్‌రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, వి.తిరుపతి రెడ్డి, అధికారులు కిషన్, అశోక్‌కుమార్, సదర్‌లాల్, బీకంసింగ్, మధుసూదన్, నరేష్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



సీఎండీ గోపాల్‌రావు